సాక్షి తిరుపతి

బుధవారం ၊ 30 ၊ జూలై ၊ 2025



పక్షుల సంరక్షణకు మాస్టర్ ప్లాన్

ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో పక్షుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. - 8లో



చాంపియన్‌షిప్ కైవసం

విజయవాడలో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో నాయుడుపేట విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారు. - 8లో



నోటిఫికేషన్ ఇవ్వలేదు కానీ..

డిగ్రీ ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో విద్యార్థులు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నారు. - 8లో

న్యూస్‌రీల్

1, 2 తేదీల్లో వెంగమాంబ వర్ధంతి ఉత్సవాలు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: శ్రీ వేంకటేశ్వరస్వామికి అపర భక్తురాలైన భక్త కవయిత్రి తరిగొండ వెంగమాంబ 208వ వర్ధంతి ఉత్సవాలు ఆగస్టు 1, 2 తేదీల్లో తిరుమల, తిరుపతి, తరిగొండలో ఘనంగా జరుగనున్నాయి. ఈ మేరకు టీటీడీ ముఖ్య ప్రజాసంబంధాల అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో 1వ తేదీన ఉదయం 9 గంటలకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో భక్తి సంగీత కార్యక్రమాలు, ఉదయం 10 గంటలకు తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై సదస్సు నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. 2వ తేదీ ఉదయం 9 గంటలకు ఎంఆర్ పల్లి సర్కిల్ వద్ద ఉన్న తరిగొండ వెంగమాంబ విగ్రహానికి టీటీడీ అధికారులు పుష్పాంజలి ఘటిస్తారు. అన్నమాచార్య కళామందిరంలో ఉదయం 10.30 గంటలకు సంగీత కచేరి, ఉదయం 11.30 గంటలకు హరికథ, సాయంత్రం 6 గంటలకు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తిరుమలలో 2వ తేదీ ఉదయం 9 గంటలకు తరిగొండ వెంగమాంబ బృందావనంలో టీటీడీ ఉన్నతాధికారులు పుష్పాంజలి సమర్పించనున్నారు. వెంగమాంబ జన్మస్థలమైన తరిగొండలో కొలువైన శ్రీ లక్ష్మీనృసింహస్వామివారి ఆలయంలో 2వ తేదీ సాయంత్రం 5 గంటలకు స్వామి వారికి కల్యాణోత్సవం అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులతో భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

1న జాబ్‌మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో వచ్చే నెల ఆగస్టు 1వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయం అధికారి శ్రీనివాసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

తిరుపతి-షిర్డీ మధ్య ప్రత్యేక రైళ్లు



తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుపతి, షిర్డీతో పాటు ఈ రెండు నగరాలకు మధ్య ఉన్న ప్రాంతాల్లో రాకపోకలు సాగించే వారి కోసం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు. తిరుపతి-సాయినగర్ షిర్డీ ప్రత్యేక రైలు ఆగస్టు 3 నుంచి సెప్టెంబర్ 28 వరకు ప్రతి ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు బయలుదేరి సోమవారం ఉదయం 10.45 గంటలకు చేరుకుంటుందన్నారు. అలాగే సాయినగర్ షిర్డీ నుంచి తిరుపతికి మరో ప్రత్యేక సర్వీసు ఆగస్టు 4 నుంచి సెప్టెంబర్ 29 వరకు ప్రతి సోమవారం రాత్రి 7.35 గంటలకు బయలుదేరి బుధవారం అర్ధరాత్రి 1.30 గంటలకు చేరుకుంటుందని చెప్పారు. ఈ ప్రత్యేక రైళ్లు రేణిగుంట, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ, సికింద్రాబాద్, లింగంపల్లి, వికారాబాద్, జహీరాబాద్, బీదర్, భాల్కీ, ఉద్గీర్, పర్లి రంగం, లాతూర్ జల్నా, ఔరంగబాద్, నాగర్‌సోల్, మన్మాడ్, కోపర్‌గావ్ స్టేషన్లలో ఇరువైపులా ఆగనున్నట్లు వెల్లడించారు.

ఉన్నత విద్యకు ఉరి

పాలకుల నిర్లక్ష్యం.. అధికారుల చేతగానితనం..వెరసి వర్సిటీల భవితవ్యం అగమ్య గోచరమవుతోంది. ఉన్నత విద్యను నిర్వీర్యం చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తోంది. ఇందులో భాగంగానే ఆగస్టు మాసం వస్తున్నా ఇప్పటివరకు డిగ్రీ అడ్మిషన్ల నోటిఫికేషన్ ఊసే ఎత్తడం లేదు. అలాగే ఎడ్‌సెట్, పీజీసెట్ నిర్వహించి దాదాపు రెండు నెలలు కావొస్తున్నా అడ్మిషన్ల ప్రక్రియపై తర్జన భర్జన పడుతోంది. దీంతో వేలాదిమంది విద్యార్థులు ఏమి చేయాలో పాలుపోని స్థితిలో ప్రతిరోజూ ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లను, వార్తా పత్రికలను చూస్తూ వేయికళ్లతో ఎదురు చూస్తున్నారు.





డిగ్రీ, పీజీ ప్రవేశాలకు నోటిఫికేషన్ వదలని ప్రభుత్వం

- ప్రభుత్వ అలసత్వంతో ఉన్నత విద్య నిర్వీర్యం
- వర్సిటీలను భ్రష్టు పట్టిస్తున్న కూటమి పాలకులు
- ఉన్నత విద్యామండలిలో నిపుణులు కరువు
- అయోమయ స్థితిలో విద్యార్థుల భవితవ్యం
- పోరుబాట తప్పదంటున్న విద్యార్థి సంఘాలు

జిల్లా సమాచారం

ఎస్వీయూ పరిధిలో పీజీ కళాశాలలు	
ప్రభుత్వ కళాశాలలు	1
సీట్ల సంఖ్య	1,450
ప్రైవేటు కళాశాలలు	11
సీట్ల సంఖ్య	4,890
డిగ్రీ కళాశాలల వివరాలు	
ప్రభుత్వ కళాశాలలు	18
సీట్ల సంఖ్య	6750
ప్రైవేటు కళాశాలలు	104
సీట్ల సంఖ్య	11,275
టీటీడీ కళాశాలలు	5
సీట్ల సంఖ్య	4,225
బీఈడీ కళాశాలలు	
ప్రభుత్వ కళాశాలలు	1
సీట్ల సంఖ్య	50
ప్రైవేటు కళాశాలలు	17
సీట్ల సంఖ్య	1,020

తిరుపతి సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత యూనివర్సిటీలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోందా అంటే అవుననే మాట విద్యార్థుల నుంచే వినిపిస్తోంది. జిల్లాలో వేలాది మంది విద్యార్థులు డిగ్రీ, పీజీలో పలు కోర్సుల్లో చేరేందుకు అడ్మిషన్ల కోసం వర్సిటీల చుట్టూ కాళ్లుఅరిగేలా తిరుగుతున్నా వర్సిటీ అధికారులు తమకే స్పష్టత లేదని చెబుతుండడం చూస్తే ఇది నిజమే అనిపిస్తోంది. ఏపీ పీజీ సెట్-2025 ఫలితాలు విడుదలై నెలరోజులపైన అవుతున్నా ఇప్పటి వరకు ప్రవేశాలను చేపట్టాలనే ఆలోచన చేయలేదు. ఉన్నత విద్యామండలిలో సరైన నిపుణులు లేకపోవడంతో ప్రవేశాలపై ప్రభావం చూపుతోందని విద్యావంతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 17 యూనివర్సిటీలకు ఓపెన్ కాంపిటీషన్ నిర్వహించాలని ఏపీపీజీసెట్ నిర్వహించారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం అదే రీతిలో ఏపీపీజీసెట్‌ను నిర్వహించి, ప్రవేశాలకు మాత్రం ఆయా వర్సిటీల పరిధిలో మాత్రమే దరఖాస్తు చేసుకునే విధంగా విధివిధానాలను రూపొందించేందుకు ప్రయత్నం చేస్తోంది. దీంతో వర్సిటీల్లో కనీసం 50 శాతం అడ్మిషన్లు కూడా జరిగే పరిస్థితి ఉండదని, భవిష్యత్తులో వర్సిటీలలో పలు కోర్సుల్లో సింగిల్ డిజిట్‌కే ప్రవేశాలు పరిమితమవుతాయని విద్యార్థి సంఘాల నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చేతగాకే తర్జన భర్జన



పీజీ అడ్మిషన్లు ఎలా చేయాలో అర్థం కాని పరిస్థితిలో ఉన్నత విద్యామండలి వ్యవహరిస్తోంది. అందులో భాగంగానే ఇప్పటి వరకు ప్రవేశాల ప్రక్రియ చేపట్టలేదు. గ్రామీణ విద్యార్థులు వర్సిటీలో పీజీలు చేయాలని ఎంతో ఆత్రుత ఎదురుచూస్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఉన్నత విద్యామండలి ఎడ్‌సెట్, పీజీ సెట్‌ల ప్రవేశాలపై ఊసే ఎత్తడం లేదు. ఉన్నత విద్య అడ్మిషన్ల విషయంలో ప్రభుత్వానికి చేతకాలేదు.

– అశోక్, వర్సిటీల కోఆర్డినేటర్ ఎస్‌ఎఫ్‌ఐ, తిరుపతి

చరిత్రలో ఎప్పుడూ ఈ పరిస్థితి లేదు



డిగ్రీ, పీజీ ప్రవేశాల విషయంలో ఇప్పటి వరకు 70 ఏళ్లుగా ఇలాంటి పరిస్థితి వర్సిటీల చరిత్రలో ఎప్పుడూ లేదు. ఆగస్టు వస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ, పీజీ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల కాకపోవడం దారుణం. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకుంటుందా ? ఉన్నత విద్యను నిర్వీర్యం చేస్తుందా ? వేచి చూడాలి. పరిస్థితి ఇలాగే కొనసాగితే పోరాట బాట తప్పదు.

– శివారెడ్డి, జాతీయ కార్యదర్శి, ఏఐఎస్‌ఎఫ్, తిరుపతి

ఉన్నతవిద్య దూరమవుతోంది



కూటమి ప్రభుత్వం గ్రామీణ, పేద విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేస్తోంది. గత ఏడాది సైతం వర్సిటీల్లో పూర్తిస్థాయిలో అడ్మిషన్లు జరగలేదు. గ్రామీణ ప్రాంత విద్యార్థులే వర్సిటీల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతారు. కానీ పీజీసెట్ ఫలితాలు విడుదలై నెలరోజులు కావొస్తున్నా ఇంతవరకు అడ్మిషన్లు చేపట్టకపోవడం దారుణం.

– మురళీధర్, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం కార్యదర్శి, తిరుపతి

వర్సిటీల మనుగడ కష్టమే..



కూటమి ప్రభుత్వం ఆగస్టు నెల ప్రారంభం అవుతున్నా ఇప్పటి వరకు పీజీ, డిగ్రీ, బీఈడీ అడ్మిషన్లు చేపట్టకపోవడం దారుణం. వర్సిటీల్లో అడ్మిషన్లు దారుణంగా పడిపోయాయి. వాటిపై ఉన్నతాధికారులు దృష్టి సారించడం లేదు. ఇప్పటి వరకు ప్రవేశాలు లేకపోవడంతో ప్రైవేటు కళాశాలల వైపు విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు. ఇలాంటి పరిస్థితులు ఇలాగే కొనసాగితే వర్సిటీల మనుగడ కష్టం.

– చిన్నా, ఏఐఎస్‌ఐ, జిల్లా కార్యదర్శి తిరుపతి

డిగ్రీ విద్యను సర్వనాశనం చేసింది



ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ కోర్సుల్లో గ్రామీణ ప్రాంతాల నుంచే విద్యార్థులు అధిక సంఖ్యలో చేరుతారు. అలాంటి పరిస్థితుల్లో ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదల చేసి నాలుగు మాసాలు గడుస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లు చేపట్టకపోవడం దారుణం. ప్రభుత్వానికి పేదల ఉన్నత విద్యపై ఆసక్తి లేదని తెలుస్తోంది. త్వరలోనే కూటమికి యువత కఠిన శిక్ష విధిస్తుంది.

– వినోద్, ఎస్‌ఎఫ్‌ఐ కార్యదర్శి, ఎస్వీయూ

విద్యాశాఖను గాలికొదిలేసిన మంత్రి లోకేష్

తిరుపతి అర్బన్: సంక్షేమ హాస్టళ్లను కూటమి ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం తిరుపతిలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లను ఆయనతోపాటు విద్యార్థి విభాగం నేతలతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో సమస్యలు ఉంటే వార్డెన్‌కు చెప్పాలని విద్యార్థులకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని హాస్టళ్ల నిర్వాహకులకు సూచించారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థుల బాగోగులను పట్టించుకోకుండా విద్యాశాఖమంత్రి నారా లోకేష్ సింగపూర్‌లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో తిరుపతి నగర విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు జశ్వంత్ కుమార్ రెడ్డి, చిత్తూరు జిల్లా విద్యార్థి విభాగం కార్యదర్శి ప్రదీప్ కుమార్, విద్యార్థి విభాగం నాయకులు పాల్గొన్నారు.



హాస్టల్ విద్యార్థుల సమస్యలను తెలుసుకుంటున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నేతలు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 77,044 మంది స్వామివారిని దర్శించుకోగా 28,478 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.5.44 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం అవుతుండగా.. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు ఉన్నవారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

గోవిన్ హోల్డింగ్స్‌తో కీలక భాగస్వామ్యం

తిరుపతి రూరల్: శ్రీ పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ భాగస్వామ్యం కోసం సింగపూర్ హెడ్‌క్వార్టర్స్‌లోని గోవిన్ హోల్డింగ్స్‌తో కీలక ఒప్పందం చేసుకుంది. జూన్ 21వ తేదీన యూనివర్సిటీలో జరిగిన ఎస్‌ఎస్‌ఐఈ-టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్‌లో ప్రారంభమైన 'నిధి-ప్రయాస్‌కాల' కార్యక్రమానికి గోవిన్ హోల్డింగ్స్ వ్యవస్థాపకులు డాక్టర్ ఆనంద్ గోవిందలూరి హాజరయ్యారు.ఆ సమయంలో మహిళల కు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వర్సిటీ నిర్వహణ తీరు, ఇప్పటివరకు సాధించిన విజయాలతో పాటు అక్కడి విద్యార్థులు, అధ్యాపకుల మేధస్సు ను నిశితంగా పరిశీలించారు. ఆ మేరకు వర్సిటీ వీసీ ఆచార్య ఉమ, గోవిన్ హోల్డింగ్స్‌తో తమ వర్సిటీతో భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేయ గా ఆయన తన నిర్ణయాన్ని అప్పటికప్పుడే ప్రకటించారు. అనంతరం ఆయన సింగపూర్ పర్యటనలోనే ఉన్న సీఎం చంద్రబాబుకు వర్సిటీ విన్నపాన్ని వివరించారు. ఆయన సూచనల మేరకు వర్సిటీతో భాగస్వామ్యానికి ఒప్పందం చేసుకున్న ట్లు మంగళవారం జూమ్ ద్వారా వర్సిటీ అధికారులకు తెలియపరచారు. వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని స్పందిస్తూ ఇది అంతర్జాతీయ సహకార దిశగా కీలకమైన ముందడుగు అన్నారు.

ఏపీలో శాంతి భద్రతలు క్షీణించాయి



లోక్‌సభలో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి

తిరుపతి మంగళం : ఆంధ్రప్రదేశ్‌లో క్షీణించిన శాంతి భద్రతల అంశాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి మంగళవారం మేటర్ అండర్ రూల్ 377 ద్వారా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఏపీలో శాంతి భద్రతలు క్షీణించాయని, పరిస్థితి విషమంగా మారిందని, ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రమాదకరమైన దాడి జరుగుతోందన్నారు. ఇందుకు ఉదాహరణగా ఈ సమావేశాల్లో తనతో పాటు ఉండాల్సిన తన సహచరుడు, రాజంపేట ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డిపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. రాజకీయ కుట్రలతో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని లోక్‌సభ దృష్టికి తీసుకెళ్లారు. ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకోవడంతో పాటు ప్రభుత్వంపై విమర్శలు చేసిన వారిని బెదిరించడం, పోలీసులను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుని కేసులు బనాయించడం.. ఇవన్నీ రాజ్యాంగ విలువలకు వ్యతిరేకంగా జరుగుతున్న చర్యలుగా భావించాలని ఆయన కోరారు. వీటిని పరిశీలించి, రాజ్యాంగం అమలులో ఉండేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

పనుల్లో పురోగతి లేకపోతే ప్రయోజనం లేదు

- భూసేకరణ, నిర్మాణ పనులు వేగవంతం చేయండి
- జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ అంశాలతో పాటు నిర్మాణపనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి జేసీ శుభం బన్సల్‌తో కలసి వర్చువల్ పద్ధతిలో అధికారులతో సమీక్షించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వాటికి పరిష్కారం చూపుతామని చెప్పారు. భూసేకరణతో పాటు నిర్మాణ పనుల్లో పురోగతి చూపాలన్నారు. ప్రతి నెల లెక్కలు చూస్తే సమస్యలు తగ్గేలా.. అభివృద్ధి ముందుకు సాగేలా ఉండాలని.. పురోగతి లేకపోతే ప్రయోజనం లేదన్నారు. రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించి రేణిగుంట, పూడి, గూడూరు, పాకాల, తిరుపతి టౌన్ పరిధిలో పనులను వేగవంతం చేయాలని చెప్పారు. అలాగే నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు పనులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఆరు లేన్ల రహదారులు నిర్మాణం, తిరుపతి బైపాస్ వేగవంతం చేయాలని, రేణిగుంట నుంచి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్యాకేజీ 2, 3, 4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకుని నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఏపీఐఐసీ ప్యాకేజీ 5, ఏడీబీ రోడ్లు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ భరత్‌రెడ్డి, తిరుపతి, నెల్లూరు, చెన్నై నేషనల్ హైవే పీడీలు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీఓలు, పలువురు తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఆగస్టు 4 నాటికి పీ-4 లక్ష్యం చేరుకోవాలి

ఆగస్టు 4వ తేదీ నాటికి పీ-4 లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులుతో కలసి అధికారులతో సమీక్షించారు. సర్వే ప్రకారం జిల్లాలో గుర్తించిన పేద కుటుంబాలను(బంగారు కుటుంబాలు) వందశాతం దత్తత తీసుకునేలా సంపన్నులు(మార్గదర్శులు) ప్రోత్సహించాలన్నారు. అలాగే పీజీఆర్‌ఎస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పెషల్ కలెక్టర్ రోజ్‌మాండ్, డీపీఓ సుశీల దేవి, డీఈఓ కేవీఎస్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, డ్వామా పీడీ శ్రీనివాసరావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ బాలకృష్ణ నాయక్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేంద్రనాయుడు, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ చరణ్ తేజ్, సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి విక్రమ్ కుమార్ రెడ్డి, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పేదలను చంద్రబాబే దత్తత తీసుకోవాలి

- సంపన్నులను ఒప్పించాలంటూ ఉద్యోగులపై ప్రభుత్వం ఒత్తిడి చేస్తోంది
- పీ-4 పేరుతో టీడీపీ ఎమ్మెల్యేల వసూళ్ల పర్వం
- ఒక్క మంత్రి కూడా పీ-4లో ఎందుకు దత్తత తీసుకోలేదు ?
- పేదలను ముష్టివాళ్లుగా చిత్రీకరించకండి
- ప్రభుత్వాన్ని నిలదీసిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న భూమన కరుణాకర రెడ్డి

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ''కూటమి ప్రభుత్వం పీ-4 పేరిట ప్రభుత్వ ఉద్యోగులపై తీవ్ర ఒత్తిడి చేస్తుంది. సచివాలయ సిబ్బందికి సరిగా జీతాలే ఇవ్వకుండా.. వారిపై ఒక్కొక్కరు ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకోవాలని విపరీతమైన ఒత్తిడి తెస్తోంది. రాష్ట్రంలో ఉన్న పేదలందరినీ సీఎం చంద్రబాబే దత్తత తీసుకోవాలి'' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భూమన కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు. తిరుపతిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో విఫలమైన చంద్రబాబు వారి దృష్టి మరల్చేందుకు కొత్తగా పీ-4 కార్యక్రమాన్ని తెరపైకి తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. ఇందులో భాగంగా ప్రభుత్వ ఉద్యోగులు కూడా దత్తత తీసుకోవాలని కలెక్టర్ల ద్వారా ఒత్తిడి చేయించడాన్ని ఆక్షేపించారు. పీ-4 పేరుతో కూటమి ఎమ్మెల్యేలు దోపిడీకి తెరతీశారని భూమన మండిపడ్డారు.

ఉద్యోగుల్లో అలజడి..

గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన నాడు-నేడు ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రుల నిర్మాణం, ఆరోగ్యశ్రీ, ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, పిల్లలకు నాణ్యమైన విద్య, అర్హులైన పేదలందరికీ ఇళ్లు వంటి గొప్ప కార్యక్రమాలను చంద్రబాబు తన అనుకూల మీడియా ద్వారా చెరిపేసే కార్యక్రమం చేపట్టారని ఆరోపించారు. పీ-4 కార్యక్రమం రాష్ట్రంలో అలజడి సృష్టిస్తోందన్నారు. కార్యక్రమంలో మంత్రులు ఒక్కరు కూడా దత్తత తీసుకున్నది లేదని.. వాళ్ల అనుకూల పత్రికల్లోనే ఎమ్మెల్యేలు పీ-4 కార్యక్రమంలో భాగంగా వసూళ్ల కార్యక్రమం ప్రారంభించారని వార్తలు రాశారని గుర్తు చేశారు. సమావేశంలో మేయర్ శిరీష, పార్టీ నేతలు పాల్గొన్నారు.

పీ-4 అంటూ చంద్రబాబు కొత్త ప్రవచనాలు ..

సీఎం చంద్రబాబు నాయుడు గత రెండు, మూడు నెలలుగా రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారుస్తానని భీకర, భీషణ ప్రతిజ్ఞలు చేస్తున్నాడని.. ప్రపంచాన్ని మార్చడానికి పీ-4 అనే కొత్త సిద్ధాంతాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజల మీద వదలడానికి సంసిద్ధులయ్యారని భూమన అన్నారు. పబ్లిక్, ప్రైవేటు, పీపుల్ పార్టనర్ షిప్ (పీ-4) కార్యక్రమాన్ని ప్రచారంతో ఊదరగొడుతున్నారని.. ఇందులో భాగంగా ధనికులంతా పేదవారికి సహాయం చేయాలని ఆయన ప్రవచిస్తున్నారని తెలిపారు. ఈ రాష్ట్రంలో కేవలం 20 లక్షలు పేద కుటుంబాలు మాత్రమే ఉన్నట్టు.. వారిలో 5.80 లక్షల మందిని గుర్తించగా.. ఇంకో 15 లక్షల మందిని గుర్తించాల్సిందిగా జిల్లా కలెక్టర్ల మీద ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్లు దిగువనున్న ఉపాధ్యాయ, ఉద్యోగ వర్గాలమీద విపరీతమైన ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఈ దేశంలో 80 శాతానికిపైగా ఆర్థిక (సంపద) కేవలం 20 శాతం మంది చేతుల్లోనే ఉందని.. చంద్రబాబు చెబుతున్నట్టు పేదరికంలో 20 లక్షల కుటుంబాలే కాదు.. రెండు మూడు రెట్లకు పైగా ఉన్నారని, అలా రాష్ట్రంలో ఉన్న దాదాపు కోటి కుటుంబాలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందు చూపుతో తన ఐదేళ్ల పాలనలో రూ.2.85లక్షల కోట్లు అందించి వారిని ఆర్థికంగా ఉన్నతస్థితిలోకి తీసుకురావడానికి కృషి చేశారని గుర్తు చేశారు. దాదాపు రూ.55 వేల కోట్లతో 25 లక్షల ఇళ్లు నిర్మించే బాధ్యత కూడా వైఎస్ జగన్‌హన్ రెడ్డి తీసుకున్నారని.. అది నిజమైన రాజకీయ తత్వవేత్త ఆలోచన చేయాల్సిన విషయం అన్నారు.

మరోవైపు ఎక్సైజ్ ఉద్యోగులపై ఒత్తిడి పెట్టి బార్, వైన్ షాపుల యజమానులను మార్గదర్శకులుగా మార్చే కార్యక్రమం చేయడం అత్యంత ఆశ్చర్యకరం అన్నారు. ఎక్సైజ్ ఉద్యోగుల ద్వారా షాపు యజమానులపై ఒత్తిడి పెడితే వాళ్లు మద్యం ధరలను మరింత పెంచుకుంటూ పోతారని ఆరోపిచంచారు.

క్లుప్తంగా

చుక్కల జింక మృతి



మృతి చెందిన జింక

దొరవారిసత్రం : అటవీ ప్రాంతంలో చుక్కల జింక మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు వివరాలు.. దొరవారిసత్రం నుంచి పూలతోట గ్రామం వైపు వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతంలో గాయపడి ఓ జింక మృతి చెందినట్లు కొందరు గుర్తించారు. ఈ జింకను వాహనాలు ఢీకొనడంతో గాయపడి అడవిలోకి వెళ్లి మృతి చెందిందా ? లేక వేటగాళ్లు వేటాడే సమయంలో గాయపరిస్తే చనిపోయిందా ? అనే అనుమానాలు స్థానికుల్లో వ్యక్తం అవుతున్నాయి.

ప్లేస్‌మెంట్‌లపై అవగాహన



మాట్లాడుతున్న ఎంబీయూ ప్రతినిధులు

చంద్రగిరి: విద్యార్థులకు అందిస్తున్న ప్లేస్‌మెంట్‌లపై మంగళవారం ఎంబీయూ క్యాంపస్‌లోని దాసరి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గ్లోబల్ డెలివరీ భాగస్వామి రాఘవేంద్ర కులకర్ణి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బీటెక్ చివరి సంవత్సరం విద్యార్థుల భవిష్యత్ దృష్ట్యా ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కొత్త ఐటీ ట్రెండ్‌లు, నియామక ప్రక్రియలు, సేల్స్‌ఫోర్స్, సర్వీస్, జావా వంటి ప్లాట్‌ఫామ్‌లలో నైపుణ్యాలకు పెరుగుతున్న డిమాండ్ గురించి వివరించారు. సీనియర్ హెచ్‌ఆర్ మేనేజర్ జితేందర్ సింగ్ మాట్లాడుతూ జెన్‌సీ ప్రోగ్రాం ద్వారా కాగ్నిజెంట్ 2026 ఫ్రెషర్స్ నియామకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ నాగరాజ్ రామారావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సారథి, కెరీర్ డెవలప్‌మెంట్ సెంటర్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఢిల్లీబాబు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో భర్తకు ఏడాది జైలు

తిరుపతి లీగల్: అదనపు కట్నం కోసం భార్యను వేధించిన కేసులో చిత్తూరు, టీవీ నాయుడు వీధికి చెందిన కరణం ఉపేంద్రకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. తిరుపతి, యశోద నగర్‌కు చెందిన కరణం పరమేశ్వరిని 2015లో కరణం ఉపేంద్ర వివాహం చేసుకున్నాడు. ఆ సమయంలో అతను కర్ణాటకలో ఆంధ్రా బ్యాంక్ మేనేజర్‌గా ఉన్నారు. వివాహమైన కొన్నాళ్లకు అతను, కుటుంబ సభ్యులు ఆమెను అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టారు. దీంతో ఆమె మహిళా పోలీసులకు భర్త ఉపేంద్రతో పాటు, అతని కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేశారు. కేసు పూర్వపరాల పరిశీలించిన జడ్జి నిందితుడు కరణం ఉపేంద్రకు మాత్రం శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. మిగతా నలుగురిపై కేసును కొట్టి వేస్తూ తీర్పులో పేర్కొన్నారు.

బలవంతపు మార్గదర్శులు

- బంగారు కుటుంబాలకు 'సంక్షేమం' కోత?
- పీ4 మొదటి విడత సర్వేలో 80,350 ఎంపిక
- ముగిసిన రెండో విడత సర్వే
- 872 మంది మార్గదర్శులు
- 11,009 బంగారు కుటుంబాల దత్తత



పీ4పై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ (ఫైల్)

తిరుపతి అర్బన్ : పీ4 పథకం (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్‌షిప్) ద్వారా అట్టడుగున ఉన్న పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని.. అందుకు సంపన్న కుటుంబాలు ముందుకు రావాలని అధికారులు వారిపై తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. బలవంతంగా దత్తత తీసుకోమని చెప్పడం ఎంటీ అంటూ పలువురు మండిపడుతున్నట్లు చర్చ సాగుతోంది. సచివాలయ ఉద్యోగులు చేపట్టిన మొదటి సర్వేలో జిల్లా వ్యాప్తంగా 80,350 కుటుంబాలు పేదలు ఉన్నట్లు నివేదికలను అధికారులకు ఇచ్చారు. అయితే ఈ సంఖ్య ఎక్కువగా ఉందని తేలడంతో వడపోతకు మరోసారి ఎంపీడీవోల నేతృత్వంలో గ్రామసభలు నిర్వహించి ఈనెల 15 నుంచి 25 వరకు సర్వేలు నిర్వహించారు. అయితే రెండో విడత జాబితాను మాత్రం వెల్లడించకపోవడం గమనార్హం.

పీ4 స్కీమ్‌కు సాయం చేసే సంపన్నులను మార్గదర్శులుగాను, సాయం పొందే పేదలను బంగారు కుటుంబాలుగా ప్రభుత్వం నామకరణ చేసింది. దీంతో అధికారులు అలానే పిలుస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను చూసి, కొందరు మార్గదర్శులుగా సాయం అందించేందుకు వెనుకాడుతున్నారు. మార్గదర్శులుగా ఉండకపోతే ప్రభుత్వం తమపై రాజకీయ కక్షలకు పాల్పడుతుందేమోననే ఆందోళన మరికొందరిలో ఉంది. పారిశ్రామిక వేత్తలను మార్గదర్శులను ఒప్పించి ముందుకు తీసుకు రావాలని, లేదంటే ప్రభుత్వ ఉద్యోగులే మార్గదర్శులుగా మారాలని చంద్రబాబు సర్కారు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అధికారులు డోలాయమానంలో పడ్డారు.

గెజిటెడ్ అధికారి కనీసం ఒక కుటుంబం దత్తత

ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం, గెజిటెడ్ ర్యాంకు కలిగిన అధికారి కనీసం ఒక కుటుంబాన్ని దత్తత తీసుకోవాలి. ప్రతి ఆసుపత్రి నుంచి ఐదుగురు మార్గదర్శులుగా మారాలని స్పష్టం చేసింది. ఉద్యోగులు కూడా బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఒత్తిడి తీసుకొస్తోంది. తమ కుటుంబాలనే ఆర్థికంగా బలోపేతం చేసుకోలేకపోతున్నామని, ఇప్పుడు ఇతరులను దత్తత తీసుకోవడంపై ఉద్యోగ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బంగారు కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు కోత?

బంగారు కుటుంబాలకు ఎంపికైన వారికి ప్రభుత్వం అందించనున్న సంక్షేమ పథకాలను కట్ చేస్తారంటూ చర్చ సాగుతోంది. ఈ అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఒక వేళ కట్ చేస్తే బంగారు కుటుంబాలుగా ఉండడానికి వారు ఇష్టపడుతారో లేదో తెలుసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అంతా చర్చించుకుంటున్నారు. సూపర్ సిక్స్‌లో అరకొరగా తల్లికి వందనం, పాక్షికంగా ఉచిత గ్యాస్ అమలు మినహా తక్కిన నాలుగు పథకాలు అమలు చేయలేని ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను ఇప్పటికే ఎదుర్కొంటోంది. ఈ చర్చను పక్కదారి పట్టించేందుకు పీ4 అనే ఓ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చిందనే విమర్శలు లేకపోలేదు. మొత్తంగా ఆగస్ట్ 15కు పీ4 టార్గెట్‌ను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఎంత మేరకు సాధిస్తారో వేచి చూడాల్సి ఉంది.

స్వచ్ఛందంగా ముందుకు రావాలి



జిల్లాలో ఇప్పటి వరకు 872 మంది పారిశ్రామిక వేత్తలు 11,009 మంది కుటుంబాలను దత్తత తీసుకున్నారు. పీ4 ప్రాజెక్టు బాధ్యతల ప్రణాళిక, గణాంకాల శాఖకు అప్పగించారు. ఈ క్రమంలో అందరికీ అవగాహన కల్పిస్తున్నాం. సచివాలయ ఉద్యోగుల సర్వేలో జిల్లాలో పేదలు 80 వేల మందికి పైగా ఉన్నట్లు జాబితాను ఇచ్చారు. ఈ క్రమంలో మరోసారి ఎంపీడీవోల నేతృత్వంలో ఈ నెల 15 నుంచి 25 వరకు గ్రామ సభలు నిర్వహించి వాస్తవాలను నిగ్గు తేల్చుతున్నాం. పేదలకు సాయం చేయడానికి సంపన్నులు ముందుకు రావాలని కోరుతున్నాం. ఎవరిపైనా ఒత్తిడి పెట్టడం లేదు. స్వచ్ఛందంగా వారే ముందుకు రావాలని కోరుతున్నాం.

– వెంకటేశ్వర్లు, జిల్లా ప్రణాళిక, గణాంకాలశాఖ అధికారి

ఇల్లు కూల్చేసిన వారిపై కేసు నమోదు

చిట్టమూరు: మండల పరిధిలోని పెళ్లకూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పారిచర్ల రమణయ్య, నాగజ్యోతి ఇంటిని కూల్చి వేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్నబల రామయ్య మంగళవారం తెలిపారు. సోమవారం పారిచర్ల రమణయ్య ఇంటిని కూల్చి వేసిన సంఘటన తెలిసిందే. దీంతో బాధితులు తమ ఇంటిని కూల్చి వేశారని చిట్టమూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ విచారణ జరిపి ఈ సంఘటనలో పాల్గొన్న పారిచర్ల ఏడుకొండలు, కస్తూరయ్య, నాగరాజు, కృష్ణయ్య, మరో ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ఓజిలి: మండల పరిధిలోని రావిపాడు చెరువులో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన వెంకటకృష్ణయ్య(55) ఈనెల 27వ సాయంత్రం బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. అయితే అతని కోసం కుటుంబసభ్యులు, బంధువులు చుట్టుపక్కల గ్రామాల్లో గాలించారు. ఎక్కడా కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన హరిబాబు అనేవ్యక్తి చెరువులో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందించాడు. వారు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహం వెలుపలికి తీసి వెంకటకృష్ణయ్యగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూళ్ల విలీనం పేరిట భ్రష్టు పట్టించారు

- కేవీబీపురం ఎంఈఓ, సీఆర్పీపై చర్యలు తీసుకోండి
- డీఈవైఓకు పాతపాళెం, ఏపీపురం గ్రామస్తుల ఫిర్యాదు



డీవైఈఓ మహేశ్వరయ్యకు వినతిపత్రం అందిస్తున్న పాతపాళెం, ఏపీ పురం వాసులు, సీపీఎం నేతలు

కేవీబీపురం: ప్రభుత్వ స్కూళ్లలో చదివే పేద విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని ఏపీ పురం(అప్పనిగుంట), పాతపాళెం గ్రామానికి చెందిన సుమారు 60 మంది దళితులు కేవీబీపురం విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా తమ గ్రామాల్లో నడుస్తున్న ప్రభుత్వ స్కూళ్లను 117 జీఓ విలీనం పేరుతో ఎంఈఓలు భ్రష్టు పట్టించారని ఆరోపించారు. స్కూళ్ల విలీనంలో భాగంగా మ్యాపింగులు చేసే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కమిటీ, గ్రామస్తులకు కనీసం సమాచారం లేకుండా, కమిటీ మెంబర్ల సంతకాలను కూడా ఉపాధ్యాయులు, సీఆర్పీలే ఫోర్జరీ చేసి అడ్డగోలుగా మ్యాపింగులు చేశారని ఆరోపించారు. కమిటీ మెంబర్ల సంతకాల ఫోర్జరీపై తక్షణమే విచారణ జరిపి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ డీవైఈఓ మహేశ్వరయ్యకు వినతిపత్రం అందించారు. మండలంలోని అనేక గ్రామాల్లో సమస్యలు తలెత్తడానికి కారణమైన ఎంఈఓతో పాటు బాధితుల పట్ల దురుసుగా ప్రవర్తించిన సీఆర్పీపై అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం జిల్లా నాయకుడు దాసరి జనార్ధన్ డీవైఈఓకు వినతి పత్రాన్ని అందించారు. సమస్యలు పరిష్కరించకపోతే సోమవారం నుంచి కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమరణ నిరాహారదీక్షకు దిగుతామని హెచ్చరించారు. దీనిపై డీవైఈఓ మహేశ్వరయ్య స్పందిస్తూ ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో పాతపాళెం గ్రామస్తులు ప్రవీణ్, నాగరాజు, ఏపీ పురం గ్రామస్తులు అక్కులయ్య పాల్గొన్నారు.

శేషాచలంలో గజరాజుల ఘీంకారం

- తొలుత నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలో పంటపొలాల్లో బీభత్సం
- ఆపై శ్రీవారిమెట్టు మార్గంలోకి ప్రవేశం
- స్మగ్లర్ల కోసం ఎగుర వేసిన డ్రోన్‌లో 17 ఏనుగుల కదలికలు
- అప్రమత్తమైన అధికార యంత్రాంగం



నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని పంటపొలాల వద్ద సంచరిస్తున్న ఏనుగులు



ధ్వంసమైన పంట పొలాలను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

చంద్రగిరి: ఇన్నిరోజులూ అటవీ సమీప గ్రామాలపై దాడులు చేస్తున్న గజరాజులు రూటుమార్చాయి. పంట పొలాలను ధ్వంసం చేయడంతో పాటు భక్తులు అధికంగా కాలినడకన వెళ్లే శ్రీవారిమెట్టు మార్గంలోకి చేరుకోవడంతో అప్రమత్తమైన అధికారులు వాటిని అటవీ ప్రాంతంలోకి తరిమేసిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. మండల పరిధిలోని నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని పంట పొలాల్లోకి సు మారు 17 ఏనుగులు చేరుకున్నాయి. వరిపంటతో పాటు అరటి తోటలను తొక్కి నాశనం చేశాయి. అందినకాడికి పంటలను ఆరగించి బీభత్సం సృష్టించాయి.

స్మగ్లర్ల కోసం డ్రోన్లతో గాలిస్తుండగా!

నరసింగాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని పంటలను నాశనం చేసిన గజరాజులు తెల్లవారుజామున శ్రీవారిమెట్టు వద్దకు చేరుకున్నాయి. ఎర్రచందనం స్మగ్లర్ల కోసం డ్రోను కెమెరాలతో గస్తీ కాస్తున్న అధికారులు ఏనుగుల మందను గుర్తించారు. ఈ క్రమంలో తిరుమల శ్రీవారిని దర్శించుకోవడానికి టోకెన్లు పొందిన భక్తులు వాహనాలతో పాటు కాలినడకన వెళ్తున్నారు. వెంటనే అప్రమత్తమైన అధికార యంత్రాంగం విజిలెన్స్, అటవీ, పోలీసు శాఖ అధికారులు మార్గంలోని శ్రీవినాయక స్వామివారి ఆలయం వద్ద భక్తులను నిలువరించారు. అనంతరం అటవీ అధికారులు ఏనుగుల మందను అడవులోకి తరిమేశారు. తరువాత భక్తులను టీటీడీ ఉచిత బస్సు ద్వారా శ్రీవారిమెట్టుకు తరలించారు. ఏనుగుల దాడుల్లో దెబ్బతిన్న పంటలను అటవీ అధికారులు పరిశీలించారు. ఏనుగుల దాడులతో పంటలు తీవ్రంగా నష్టపోయాయని, అధికారులు తమను ఆదుకోవాలంటూ రైతులు వేడుకుంటున్నారు.

పక్షుల సంరక్షణకు మాస్టర్ ప్లాన్

తిరుపతి అర్బన్: పక్షుల సంరక్షణకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి ఆయన అధికారులతో సమీక్షించారు. ప్రధానంగా నేలపట్టు పక్షి అభయారణ్యం ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుకు సంబంధించి జేసీ శుభం బన్సల్, అటవీ సంరక్షణాధికారి సెల్వం, డీఎఫ్ఓ వివేక్‌తో కలసి చర్చించారు. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిలో అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ మధ్య సమతౌల్యం సాధించడానికి అన్ని శాఖల సమన్వయం అత్యంత అవసరమన్నారు. ఈ ప్రక్రియలో ప్రజల జీవనోపాధి, భద్రత, భవిష్యత్ తరాల కోసం ప్రకృతి పరిరక్షణ రెండూ ముఖ్యమైనవిగా వెల్లడించారు. జిల్లాలోని పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షి అభయారణ్యం, పరిసర ప్రాంతాల్లో 2025 సంవత్సరానికి సంబంధించి వార్షిక కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాలని చెప్పారు. ప్రతి శాఖ తమ పాత్రను నిష్పక్షపాతంగా నిర్వర్తించాలని తెలిపారు. సమావేశంలో డీఆర్ఓ నరసింహులు, అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ హారిక, డీపీఓ సుశీల దేవి, డీఆర్‌డీఏ పీడీ శోభన్ బాబు, డ్వామా పీడీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నోటిఫికేషన్ ఇవ్వలేదు కానీ..



డిగ్రీ ప్రవేశాల కోసం దరఖాస్తులను సమర్పించేందుకు విచ్చేసిన విద్యార్థులు, తల్లిదండ్రులు

తిరుపతి సిటీ: డిగ్రీ నోటిఫికేషన్ ఊసేలేదు కానీ ఎస్వీడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో ఆఫ్‌లైన్‌లో వందలాదిమంది దరఖాస్తులు చేసుకుంటున్నారు. గత వారం ఉన్నత విద్యామండలి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధాలుగా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో గత రెండు రోజులుగా పద్మావతి డిగ్రీ కళాశాలలో ఆఫ్‌లైన్ విధానంలో దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణమ్మ మాట్లాడుతూ విద్యార్థులు తమకు ప్రవేశాలు దక్కవేమోనని ఇప్పటి నుంచే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకుంటున్నారని తెలిపారు. ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారం తాము ప్రవేశాలు చేపట్టనున్నామని చెప్పారు.

● హే బ్రో!



వాహనాల రద్దీ అత్యధికంగా ఉండే తిరుపతిలోని రామాపురానికి వెళ్లే రోడ్డులో ఓ ఊసరవెల్లి ఒక్కసారిగా ఇలా దూసుకొచ్చింది. బిడ్డా.. ఇది నా అడ్డా, నువ్వే కాస్త చూసుకుని వెళ్లు అన్నట్లు రోడ్డు మధ్యలో కాసేపు ఆగి నిదానంగా పక్కకి వెళ్లింది. వాహనదారులు తమ వాహనాలను నెమ్మదిగా నడిపి ఊసరవెల్లి రోడ్డు దాటేవరకూ ఆగడం కనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

హాస్టళ్లలో సమస్యలు పరిష్కరించండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

తిరుపతి అర్బన్: జిల్లాలోని హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నేతలు మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ప్రధానంగా పుత్తూరు బీసీ హాస్టల్ ప్రైవేటు అద్దె భవనంలో నిర్వహిస్తున్నారని.. అయితే ఆ భవనాన్ని ఖాళీ చేయాలని చెప్పడంతో విద్యార్థులు అయోమయంలో పడ్డారన్నారు. అలాగే చంద్రగిరి బీసీ హాస్టల్‌లో అవసరమైన గదులు లేకపోవడంతో ఒక్కో గదిలో 20 నుంచి 25 మంది విద్యార్థులు ఉంటున్నారని చెప్పారు. సత్యవేడులోని ఎస్సీ కళాశాల హాస్టల్ భవనం శిథిలం కావడంతో బీసీ హాస్టల్‌లో విద్యార్థులు తలదాచుకోవాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. సూళ్లూరుపేట, వెంకటగిరి, నాయుడుపేటలో విద్యార్థులకు సరైన హాస్టళ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. తిరుపతిలోని హాస్టళ్లను మెరుగుపరచాల్సి ఉందని తెలియజేశారు. ఆ మేరకు విచారణ చేపట్టి పిల్లలకు న్యాయం చేస్తామని కలెక్టర్ వారికి వివరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అక్బర్, భగత్ రవి, జిల్లా ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, జిల్లా నాయకులు శివ తదితరులు ఉన్నారు.

స్కిట్ పూర్వవైభవానికి సహకరిస్తాం



మాట్లాడుతుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: స్కిట్ కళాశాలతో తనకు ఎంతో అనుబంధం ఉందని 2010–11 ప్రాంతంలో మిస్‌మేనేజ్‌మెంట్, పాలిటిక్స్‌తో కళాశాల విహీనంగా మారిందని జేఎన్‌టీయూ వైస్‌చాన్సలర్ సుదర్శన్‌రావు అన్నారు. కళాశాల మూతపడడం చాలా బాధ కలిగించిందన్నారు. స్కిట్ కళాశాల పూర్వవైభవానికి పూర్తిగా సహకారం అందిస్తామన్నారు. మొదటి కౌన్సెలింగ్‌లో అనుమతి వచ్చి ఉంటే బాగుండేదని, రెండవ కౌన్సెలింగ్‌లో రావడం సంతోషకరమన్నారు. ఇందుకు విద్యాశాఖమంత్రి మంత్రి నారా లోకేష్, ఓఎస్డీలు ప్రసాద్, రమణ, కార్యదర్శి శశిధర్ పునఃప్రారంభానికి కృషి చేశారన్నారు. రెండు నెలల్లో దీనిపై అనేకసార్లు నివేదికలు ప్రభుత్వానికి పంపించి ఎట్టకేలకు తేగలిగామని తెలిపారు. రెండు మూడేళ్లలో స్కిట్ ఉత్తమమైన ఫలితాలు సాధించే విధంగా పూర్తి సహకారం అందిస్తామన్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమలు ఇండియాలోకి వస్తున్నాయని ఈ స్కిట్‌లో వచ్చే విధంగా చూస్తామన్నారు. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

జాతీయస్థాయి పోటీల్లో చాంపియన్‌షిప్ కైవసం



పతకాలను చూపుతున్న నాయుడుపేట క్రీడాకారులు

నాయుడుపేటటౌన్ : విజయవాడలో జరిగిన జాతీయస్థాయి ఓపెన్ తైక్వాండో క్రీడా పోటీల్లో నాయుడుపేట తైక్వాండో క్లబ్‌కు చెందిన క్రీడాకారులు చాంపియన్‌షిప్ కైవసం చేసుకుని ప్రతిభ చాటినట్లు మంగళవారం మాస్టర్ ఉయ్యాల పవన్‌కుమార్ తెలిపారు. ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో 10వ జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో క్రీడాపోటీలు జరిగినట్లు వెల్లడించారు. వివిధ విభాగాల్లో జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా 1500 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. నాయుడుపేట మాస్టర్ తైక్వాండో క్లబ్‌లో శిక్షణ పొందిన 65 మంది క్రీడాకారులు వివిధ విభాగాల్లో పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. నాయుడుపేటకు చెందిన క్రీడాకారులు ప్రతిభ చాటి 49 పతకాలను సాధించినట్లు వివరించారు. ఇందులో కొరికి విభాగంలో 12 బంగారు పతకాలు, 14 వెండి, 22 కాంస్య పతకాలను దక్కించుకున్నట్లు తెలిపారు. అలాగే పూమ్సే విభాగంలో 14 బంగారు, 3 వెండి, 1 కాంస్య పతకం కైవసం చేసుకున్నారన్నారు. సబ్ జూనియర్ విభాగంలో మహిత ఉత్తమ క్రీడాకారిణిగా అవార్డు దక్కించుకుందన్నారు. జూనియర్ విభాగంలో కొరికి, పూమ్సే విభాగాల్లో దీపిక 4 బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. చిన్నపిల్లల విభాగంలో మూడేళ్ల చిన్నారి నవదీప్ కృష్ణ వెండి పతకం సాధించి అందరినీ ఆశ్చర్య పరచినట్లు వివరించారు. అత్యధిక పతకాలను సాధించిన నాయుడుపేట తైక్వాండో క్లబ్ క్రీడాకారులు ఓవరాల్‌గా చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, శాప్ చైర్మన్ రవినాయుడు, నేషనల్ రెఫరీ షేక్ అష్రాఫ్, తదితరులు నాయుడుపేట క్రీడాకారులను, శిక్షణ ఇచ్చిన పవన్ కుమార్‌ను అభినందించారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT, B.Tech, Diploma, MA, M.Com, M.Sc, MBA, MCA Regular/lateral entry.9381287629

Wanted

■తిరుపతి శ్రీకాళహస్తి హైవే మెర్లపాక వద్ద హోటల్ పద్మావతి నందు పనిచేయుటకు సప్లయర్స్, సెక్యూరిటీ, సౌత్ ఇండియన్ మాస్టర్ కావలెను. ఉచిత వసతి కలదు. ✆ 95504 97002.

■కపిల్ చిట్స్ పలమనేరు బ్రాంచి యందు బిజినెస్ ఎగ్జిక్యూటివ్ / కలెక్షన్ ఇన్చార్జి గా పనిచేయుటకు 10th, ఆపైన చదివిన, వయస్సు :19-30 సంవత్సరాలు కలిగిన అభ్యర్థులు కావలెను. జీతం:18,000/-, సంవత్సరానికి 3,000/- ఇంక్రిమెంట్+ఇన్సెంటివ్+బోనస్. ✆ 8466989796, 9948312025

■Work from home మా కంపెనీ అడ్వర్టైజ్మెంట్లు మీ మొబైల్ ద్వారా పార్ట్ టైం పంపుటకు స్త్రీ/పు. కావలెను. వారానికి 3,500. వివరాలకు వాట్సాప్‌లో hi అని మెసేజ్ పెట్టి కాల్ చేయండి 82478 08801

■WANTED sales executives, service supervisors, Sri Durga Motors, autonagar, Tirupati. Cell : 9059927027, 9700663181

■స్వామి వివేకానంద ఓల్డేజ్ హోం (VJA) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషంట్ల సేవకు, ఇంటి/ వంట పని, బేబీ కేర్ కొరకు 10th ఆపై చదివి, Age: 20-30 కలిగిన (M/F) వర్కర్లు కావలెను. భో+వ+జీ: 18-20 వేలు. ఏజెంట్ల కమీషన్: 5000 ✆ 9959031122, 9676901122

■కన్సల్టెన్సీ కాదు.VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటవారు,RMP&డాక్టర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.9014885406

■ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663

నాలుగులైన్ల ప్రకటనకు : రూ. 375/-
అదనపు లైనుకు : రూ . 90/-
ప్రతి ప్రకటనపై G.S.T 5% అదనం
Contact
9705444178
9951602970

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

SAKSHI MEDIA GROUP www.sakshi.com
పదవీ విరమణ శుభాకాంక్షలు
మీ ఆత్మీయులకు ఒక మధుర జ్ఞాపకాన్ని అందివ్వండి.



జిల్లా ప్రకటనలపై 15% డిస్కౌంట్
ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం
మీ కుటుంబ సభ్యులలో, మీ బంధుమిత్రులలో, మీ సహోద్యోగులలో ఎవరైనా పదవీ విరమణ చేస్తున్నారా! అయితే వారికి తీపి గుర్తుగా సాక్షి ద్వారా తెలియజేయండి పదవీ విరమణ శుభాకాంక్షలు...
తిరుపతి లోకల్ ఆఫీసు
రూమ్ నెం.203 బొడుగు ప్లాజా, తిరుమల బైపాస్‌రోడ్డు, తిరుపతి
తిరుపతి జిల్లా : 99122 20586 99516 02971

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లి.
జిల్లా కార్యాలయము, కలెక్టర్ వారి కార్యాలయము,
4వ అంతస్తు, తిరుపతి జిల్లా, తిరుపతి, ✆ 7702573537

నెం:పి.డి.యస్/మూమెంట్/స్టేజ్-II/2025 తేది: .07.2025

నిత్యావసర సరుకులను (పి.డి.యస్) రవాణా చేయుటకు ఈ-టెండరు ప్రకటన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, తిరుపతి జిల్లా లోని **తిరుపతి, పాకాల, పుత్తూరు, పిచ్చాటూరు, శ్రీకాళహస్తి, గూడూరు, వాకాడు, చంద్రగిరి, సత్యవేడు మరియు మండల స్థాయి గోదాముల** (MLS పాయింట్ల) నుండి చౌక ధరల దుఖాణములకు తేది.31.03.2027 మరేదైనా నిర్ణయించబడు ప్రదేశాలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు, మధ్యాహ్న భోజన పథకము బియ్యము కాలానుగుణంగా ప్రవేశపెట్టే మరే ఇతర ప్రభుత్వ పథకం కింద అయిన రెండో దశ చేయుటకు 2025-27 సంవత్సరమునకు అనగా 31.03.2027 వరకు ఆన్లైన్ (https://apeprocurement.gov.in) టెండర్లు కోరబడుచున్నవి.

క్రమ సంఖ్య	వివరములు	తేది	సమయము
1.	ఆన్లైన్ నందు అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకునే తేదీ సమయము	31.07.2025	ఉదయం 10.00 గంటల నుండి
2.	ఆన్లైన్ నందు అప్లికేషన్ డౌన్లోడ్ చేసుకునే చివరి తేదీ సమయము	11.08.2025	ఉదయం 10.00 గంటలకు
3.	ఆన్లైన్ నందు అప్లికేషన్‌ని సమర్పితం చేసుకునే చివరి తేదీ సమయము	11.08.2025	ఉదయం 11.00 గంటలకు
4.	టెక్నికల్ సాంకేతిక బిడ్డును ఓపెనింగ్ తేదీ మరియు సమయము	12.08.2025	మధ్యాహ్నం 03.00 గంటలకు
5.	ఫైనాన్షియల్ ఆర్థిక బిడ్డును ఓపెనింగ్ తేదీ మరియు సమయము	13.08.2025	ఉదయం 11.00 గంటలకు

పూర్తి వివరాలు మరియు టెండర్ ఫారం పొందుటకు గాను (https://apeprocurement.gov.in) చూడగలరు. ఎటువంటి కారణం తెలుపకుండా ఈ టెండర్లను పూర్తిగా గాని పాక్షికంగా గాని రద్దు చేయుటకు తిరస్కరించుటకు మరియు కొత్తగా టెండర్లు పిలుచుటకు జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఎక్స్ అఫీషియో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ, తిరుపతి కి అధికారం కలదని తెలియజేయడమైనది.

శ్రీ శుభం బన్సల్, I.A.S.,
జాయింట్ కలెక్టర్ మరియు E.O.E.D,
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ లి.